



# మనం

## కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

ఆదివారం | 18 | అక్టోబర్ | 2026 | పేజీలు 13 | www.manamepaper.com


# తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత.. యాసంగిలో వరి సాగు చేయవద్దు

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి స్పెషల్ చీఫ్ సెక్రటరీ బెనహుర్ మహేష్ దత్ ఎక్కా

### సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఆరు నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

### చివరి ఆయకట్టు వరకు కాలువ నీరు చేరేలా చర్యలు

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాల కలెక్టర్లతో సమీక్ష

**సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్, సాగునీటి అవసరాలకు సంబంధించి ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి బెన్హూర్ మహేష్ దత్ ఎక్కా అధికారులను ఆదేశించారు.**



**కరీంనగర్, అక్టోబర్17(మనం బ్యూరో ) :** సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్, సాగునీటి అవసరాలకు సంబంధించి ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని, తాగునీటికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ యాసంగి సీజన్‌లో..

- మిగతా 2లో..



# ప్రకృతి వైపరీత్యమే ఎల్‌నినో

### ఇదేదో కాంగ్రెస్ తెచ్చిన కరువు కాదు : మంత్రి పొన్నం

**చిగురుమామిడి, అక్టోబర్ 18 (మనం న్యూస్) :** ఎల్‌నినో అనేది ప్రకృతి వైపరీత్యమేనని, ఇదేదో కాంగ్రెస్ తెచ్చిన కరువు కాదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. వర్షం పడడం, పడకపోవడం ప్రకృతికి సంబంధించిన అంశమని, దీన్ని రాజకీయం చేయడం బీఆర్ఎస్ నేతలకు తగదని హితవు పలికారు. శనివారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్లమ్మ చెరువును మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. సద్దుల బతుకమ్మ వేడుకల కోసం ఎల్లమ్మ చెరువు వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ "సద్దుల బతుకమ్మ వేడుకల కోసం ఎల్లమ్మ చెరువు దగ్గర ఘనంగా ఏర్పాట్లు చేశాం. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును, గ్లాస్ బ్రిడ్జ్ ను, గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. హుస్నాబాద్ ను రాష్ట్రంలోనే నెంబర్ వన్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతాం.రెండు రోజుల క్రితమే కబడ్డీ అకాడమీ మంజూరు చేశాం. నిన్ననే..

- మిగతా 3లో..

# ఆలయ,గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తా

### ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**రాయికల్, అక్టోబర్ 17 (మనం న్యూస్) :** ఆలయ అభివృద్ధితోపాటు గ్రామ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలోని దుర్గామాత ఆలయ ఆవరణలో గ్రామపంచాయతీ నిధులు రూ. 3 లక్షలతో నిర్మించనున్న మరుగుదొడ్లకు ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. అంతకు ముందు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఆలయ ఆవరణలో అన్నదాన షెడ్డు నిర్మాణానికి నిధులు..

- మిగతా 4లో..




# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

### ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

# తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత.. యాసంగిలో వరి సాగు చేయవద్దు

( మొదటి పేజీ తరువాయి )

వరి సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి బెన్హా హుర్ మహేష్ దత్ ఎక్కా అధికారులను ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రానున్న పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు చిత్ర మిశ్రా, బి. సత్య ప్రసాద్, కోయ శ్రీహర్ష, గరిమ అగర్వాల్ లతో కలిసి ప్రత్యేక అధికారి బెన్హా హుర్ మహేష్ దత్ ఎక్కా సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఉన్నత అధికారులు వ్యవసాయం, విద్యుత్, నీటిపారుదల, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, నీటి సంరక్షణ, ఉపాధి హామీ, మున్సిపాలిటీల్లో అమృత్ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా వివరాలు సమర్పించారు.

ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి బెన్హా హుర్ మహేష్ దత్ ఎక్కామాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా మారుతున్న నేపథ్యంలో వచ్చే ఏడాది ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. ప్రస్తుతం గోదావరి, కృష్ణా నదుల్లో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని, కొత్తగా నీటి ప్రవాహాలు లేని పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల బోరు బావులు ఉండగా, వాటిలో 5 నుంచి 6 లక్షల వరకు పనిచేయని పరిస్థితి ఉందని, భూగర్భ జలాలు వేగంగా తగ్గుతున్నాయని తెలిపారు. యాసంగి సీజన్‌లో వరి సాగుకు నీటి లభ్యత ఉండే అవకాశం లేనందున రైతులను వరి సాగు నుంచి దూరంగా ఉంచేందుకు గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేయకుండా ఉండాలని, తక్కువ నీటితో, తక్కువ వ్యవధిలో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని ఆదేశించారు. ఆయిల్ పామ్, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి పంటలను ప్రోత్సహించాలని, కోతులు, ఇతర సమస్యలు లేని ప్రాంతాల్లో కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, పంటల అవసరాలను వివరించాలని తెలిపారు. రైతులు నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా సాగు చేసి నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులకు మార్కెటింగ్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా మార్కెటింగ్ శాఖ చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. పంటలకు కనీస మద్దతు ధర లభించేలా పర్యవేక్షించాలని, సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించిన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రానున్న ఎనిమిది నెలలకు సంబంధించి గ్రామస్థాయిలో సూక్ష్మ ప్రణాళికలు రూపొందించాలని ప్రత్యేక అధికారి సూచించారు. ప్రతి గ్రామంలో తాగునీటి అవసరాలు, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల స్థితి, విద్యుత్ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ పనులపై ముందస్తు అంచనాలు రూపొందించాలని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకునేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రానున్న నెలల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి తెలిపారు. ప్రభుత్వం అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా విద్యుత్ లభ్యత పరిమితంగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాలువల ద్వారా సాగునీరు అందని ప్రాంతాల్లో రైతులు బోరు బావులపై అధికంగా ఆధారపడితే విద్యుత్ డిమాండ్ పెరిగి సబ్‌స్టేషన్లపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తే అవకాశం ఉన్నందున విద్యుత్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**తాగునీటికి మాత్రమే అందుబాటులో ఉన్న నీటిని వినియోగించాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాలం వరకు ప్రజలకు తాగునీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కాలువల ద్వారా ప్రస్తుత ఖరీఫ్ పంటలను రక్షించేందుకు విడుదల చేసే నీరు చివరి ఆయకట్టు వరకు చేరేలా పర్యవేక్షించాలని, మధ్యలో మోటార్ల ద్వారా నీటిని తోడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాబోయే నెలల్లో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని, మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ అందుబాటులో విద్యుత్ లభ్యత పరిమితంగా ఉందని తెలిపారు. కాలువల ద్వారా సాగునీరు అందని పరిస్థితుల్లో రైతులందరూ బోరుబావుల ద్వారా నీటిని తోడితే విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగి సబ్‌స్టేషన్లపై అధిక భారం పడుతుందని, ఫలితంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే ప్రమాదం ఉందని వివరించారు.వచ్చే ఏడు నుంచి ఎనిమిది నెలల పాటు విద్యుత్ రంగంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ట్రాన్స్‌కో పరిధిలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, ఆదేశించారు. విద్యుత్ ఓవర్‌లోడ్, సాంకేతిక సమస్యలు, క్షేత్రస్థాయిలో మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.

**ఉపాధి హామీ పనులతో నీటి సంరక్షణకు ప్రాధాన్యత**

కేంద్ర ప్రభుత్వం కరువు ప్రభావిత ప్రాంతాలకు ఉపశమనం కల్పించేందుకు అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ప్రత్యేక అధికారి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచి, ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు రాకుండా చూడాలన్నారు. వీబీ–జీ రామ్ జీ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ఫారంపాండ్లు, మ్యాజిక్ ఇంకుడు గుంతలు, బోరు రీచార్జ్ గుంతలు, కమ్యూనిటీ సోక్ పిట్లు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను పెద్దఎత్తున చేపట్టాలని ఆదేశించారు. కాలువల్లో పూడిక తొలగింపు, పిచ్చిమొక్కల తొలగింపు వంటి పనులను కూడా చేపట్టి నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమం ద్వారా స్థానికంగా ఉపాధి కల్పిస్తూనే నీటి సంరక్షణ ఆస్తులను అభివృద్ధి చేయాలని తెలిపారు.

**అమృత్ పనులను వేగవంతం చేయాలి**

మున్సిపాలిటీల్లో అమృత్ పథకం కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. ముఖ్యంగా వచ్చే వేసవిలో తాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కరీంనగర్ సహా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో అమృత్ పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు రాష్ట్రస్థాయిలో సమీక్ష నిర్వహించి అవసరమైన ప్రత్యేక ఆదేశాలు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. యాసంగిలో శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి పంటల సాగుకు నీరు విడుదల చేసే అవకాశం లేదని, అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితిని సాధారణ పరిస్థితిగా కాకుండా, కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న తరహాలో సమన్వయంతో ఎదుర్కోవాలని ప్రత్యేక అధికారి సూచించారు. కేవలం నిధులు అందుబాటులో ఉండటం మాత్రమే సరిపోదని, విద్యుత్, నీటి సరఫరా వ్యవస్థలు సక్రమంగా పనిచేసేలా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించడం ముఖ్యమన్నారు. ప్రతి శాఖ అధికారులు బాధ్యతతో పనిచేసి ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ..** జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 7 శాతం తక్కువగా 681.7 మి.మీ. వర్షపాతం నమోదైందని తెలిపారు. కొత్తపల్లి, జమ్మికుంట, ఎల్లందకుంట, వీణవంక, హుజూరాబాద్ మండలాల్లో లోటు వంష్షపాతం నమోదైందన్నారు. దిగువ మానేరు జలాశయంలో 15.452 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, నెలవారీ అవసరాలైన 0.68 టీఎంసీల ప్రకారం సుమారు 512 నుంచి 593 రోజుల వరకు నీటి సరఫరాకు అవకాశం ఉందని వివరించారు.

మిషన్ భగీరథ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో , కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ సహా నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో నీరు సరఫరా అవుతోందని తెలిపారు. గంగాధర, మానకొండూరు, చొప్పదండి మండలాల్లో ఉన్న స్వల్ప సరఫరా అంతరాలను అధిగమించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు వివరించారు.కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 150 ఎల్‌పీసీడీ డిజైన్ ప్రకారం నీటిని అందిస్తూ, అమృత్ 2.0 కింద నీటి శుద్ధి కేంద్రాల పునరుద్ధరణ, ఏడు ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, 7.5 కిలోమీటర్ల పంపింగ్ మెయిన్, 129 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులు చేపట్టినట్లు తెలిపారు.

**యాసంగిలో వరి సాగును 33 శాతం తగ్గించే ప్రణాళిక**

యాసంగి 2026–27 సీజన్‌లో వరి సాగును 2,82,845 ఎకరాల నుంచి 1,89,063 ఎకరాలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా 93,782 ఎకరాల వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, మొక్కజొన్నను 60,177 ఎకరాలు, పప్పుధాన్యాలను 8,737 ఎకరాలు, నూనెగింజలను 8,566 ఎకరాల్లో సాగు చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు.ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో 1,683 ఎకరాల్లో ఆయిల్ పామ్, కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సూక్ష్మ సేద్యానికి రూ. 5 కోట్ల లక్ష్యానికి గాను రూ. 1.72 కోట్ల పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు వివరించారు. సెప్టెంబర్ చివరి వారంలో వ్యవసాయ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, సెప్టెంబర్ 28న గరిష్టంగా 1,456.48 యూనిట్ల డిమాండ్ నమోదైందని తెలిపారు. భూగర్భ జలాల సంరక్షణలో భాగంగా వీబీ–జీ రామ్ జీ ద్వారా జలసిరి కార్యక్రమం కింద 1,320 వ్యక్తిగత ఫారంపాండ్లు, 10,461 మ్యాజిక్ ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్ పిట్లు, రూఫ్‌టాప్ హార్వెస్టింగ్, బోరు రీచార్జ్ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు వివరించారు. మార్చి 2027 వరకు జిల్లాలో 5.96 లక్షల మెట్రిక్ టన్నుల పశువుల మేత అవసరం ఉండగా, 8.09 లక్షల మెట్రిక్ టన్నుల మేత అందుబాటులో ఉందని, 2.13 లక్షల మెట్రిక్ టన్నుల మిగులు ఉందని తెలిపారు. పశువుల తాగునీటి అవసరాల కోసం జిల్లాలోని 184 నీటి తొట్లలో శిథిలావస్థకు చేరిన 127 తొట్లకు మరమ్మతులు చేయడంతో పాటు, మరో 261 కొత్త నీటి తొట్ల నిర్మాణాన్ని ఉపాధి హామీ నిధులతో చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు.

**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ..** జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 9 శాతం తక్కువగా వర్షపాతం నమోదైందని తెలిపారు. శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి అక్టోబర్ 10 నుంచి కాలువల ద్వారా నీటి విడుదల ప్రారంభమైనందున ప్రస్తుత ఖరీఫ్ పంటలకు సాగునీటి ఇబ్బందులు లేవని తెలిపారు.భీమారం, గొల్లపల్లి, ఇబ్రహీంపట్నం మండలాల్లో లోటు వర్షపాతం నమోదైందని, జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్, కోడిమ్యాల మండలాల్లో 34 నుంచి 41 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ మండలాలను మోస్తరు కరువు మండలాలుగా గుర్తించినట్లు వివరించారు. ఎల్-నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని, సెప్టెంబర్‌లో 33.32 శాతం, అక్టోబర్ మొదటి పక్షంలో 61.89 శాతం మేర డిమాండ్ పెరిగినప్పటికీ వ్యవసాయానికి రోజుకు 9 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో విద్యుత్ వినియోగం తగ్గుతుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు సగటున 1.32 మీటర్లు లోతుకు వెళ్లాయని, రాబోయే రెండు నెలల వరకు తాగునీటికి ఇబ్బంది ఉండదని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. చివరి ప్రాంతాలు, ప్రత్యేక సమస్యలున్న ప్రాంతాల్లో స్థానిక నీటి వనరుల ద్వారా అవసరాలు తీరుస్తున్నామని, అన్ని ప్రాంతాలకు ఇన్‌చార్జీలను నియమించి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. జగిత్యాల పట్టణంలోని నీటి శుద్ధి కేంద్రం మరమ్మతులకు మరో నెల సమయం పట్టే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పట్టణ తాగునీటి డిమాండ్‌లో 78.5 శాతం మేర సరఫరా జరుగుతోందని వివరించారు. ఎస్సారెస్పీ పరిధిలో 1,086 రోజులు, మధ్య మానేరులో 580 రోజులు, బొల్లిచెరువులో 978 రోజులు, నందిమేడారంలో 342 రోజులకు సరిపడా నీటి నిల్వలు ఉన్నట్లు ప్రజెంటేషన్‌లో వివరించారు.

(- మిగతా 3వ పేజీలో..)

# ప్రకృతి వైపరీత్యమే ఎల్‌నినో

( మొదటి పేజీ తరువాయి )

స్విమ్మింగ్ పూల్, వాటర్ స్పోర్ట్స్ కు కూడా జీవో వచ్చింది. హుస్నాబాద్ ను స్పోర్ట్స్ హబ్ గా మారుస్తున్నాం.2007లో శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టును బీఆర్ఎస్ పదేళ్లలో పట్టించుకోలేదు. సుప్రీంకోర్టు కేసులు, అడ్డంకులన్నీ మా ప్రభుత్వం వచ్చాక తొలగించాం. ఇప్పుడు కాలువల కోసం భూసేకరణ జరుగుతోంది. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ రైతుల కాళ్ల దగ్గరకు నీళ్లు తీసుకొస్తాం. వ్యవసాయానికి విద్యుత్ విషయంలో ఈ పంట వరకు ఉదయం నుండి సాయంత్రం దాకా, రాత్రి కూడా కొంత సమయం కరెంట్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు ప్రజలందరూ కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలి. వచ్చే సీజన్ లో రైతులు నీటి లభ్యతను బట్టి వరి కాకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలి.బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారో అందరికీ తెలుసు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్క హుస్నాబాద్ నియోజకవర్గానికే 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం. అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు ఇస్తాం. దీన్ని రాజకీయం చేయొద్దు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాల, అక్టోబర్ 17, (మనం న్యూస్) : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సూచించారు. మంచిర్యాలలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని, యాసంగిలో నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలని కోరారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. దివంగత కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆడపడుచులకు అందించే చీరలను ఈసారి సంక్రాంతికి పది రోజుల ముందుగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేటర్ తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రామగిరి బానేష్, అక్కల వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పూదరి తిరుపతి, మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్‌తో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్‌లో ఫారెస్ట్ మరియు పట్టా భూముల సరిహద్దుల పరిశీలన

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 17 (మనం న్యూస్): ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఫారెస్ట్ (అటవీ) మరియు పట్టా భూముల సరిహద్దులను ఆర్డీఓ (=ణూ) మరియు డి.ఎఫ్.ఓ (ణఖీూ) సంయుక్తంగా పరిశీలించారు. గ్రామంలోని అటవీ భూములకు, ప్రైవేట్ పట్టా భూములకు మధ్య నెలకొన్న సరిహద్దు వివాదాలు లేదా గందరగోళాన్ని నివారించేందుకు అధికారులు ఈ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను పరిశీలించి, రికార్డుల ఆధారంగా సరిహద్దులను సరిగ్గా గుర్తించాలని రెవెన్యూ మరియు అటవీ శాఖ అధికారులకు వారు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ఫారెస్ట్ సిబ్బంది మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత.. యాసంగిలో వరి సాగు చేయవద్దు

( 2 పేజీ తరువాయి )

జిల్లాలో 3,287 చేతిపంపులు, 2,225 మోటార్లు, 528 బావులను ప్రత్యామ్నాయ నీటి వనరులుగా వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. రైతులు వరి సాగుకు దూరంగా ఉండేలా అవగాహన కల్పిస్తూ మొక్కజొన్న, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన పంటల రక్షణకు బిందు, తుంపర సేద్య పరికరాలను అందించడంతో పాటు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం కింద ఫారంపాండ్లు, ఇంకుడు గుంతలు, బోరు రీచార్జ్ నిర్మాణాల ద్వారా నీటి సంరక్షణ పనులను ముమ్మరం చేసినట్లు తెలిపారు.

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,** ..జిల్లాలో 863 మి.మీ. వర్షపాతం నమోదై సాధారణం కంటే 5 శాతం తక్కువగా ఉందని తెలిపారు. సుల్తానాబాద్‌లో 33 శాతం, ఎలిగేడు మండలంలో 24 శాతం, జూలపల్లిలో 21 శాతం, మంథనిలో 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని, మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం ఉందని వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో డ్రై స్పెల్స్ నమోదు కాకపోవడంతో జిల్లాలో ప్రస్తుతం కరువు పరిస్థితులు లేవని తెలిపారు. ప్రస్తుతం పంటల పరిస్థితి సాధారణంగా ఉందని, పంటలకు నీటి ఎద్దడి లేదా ఎండిపోయిన పరిస్థితులు లేవని తెలిపారు. సెప్టెంబర్ 2026 నాటికి సగటు భూగర్భ జలమట్టం 4.54 మీటర్ల లోతులో ఉందని, 12 మండలాల్లో భూగర్భ జలమట్టం ఐదు మీటర్ల లోపు ఉందని పేర్కొన్నారు.శ్రీరామసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 2,12,036 ఎకరాల ఆయకట్టులో ప్రస్తుత ఖరీఫ్ పంటల రక్షణకు సుమారు 60 శాతం ప్రాంతానికి నీరు అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీపాద ఎల్లంపల్లి జలాశయంలో 18.17 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని వివరించారు.యాసంగి సీజన్‌లో నీటి వనరులు సరిపోని ప్రాంతాల్లో వరి సాగును పూర్తిగా తగ్గించి, తక్కువ నీటితో పండే మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర వాణిజ్య పంటల వైపు రైతులను మళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు, క్షేత్రస్థాయి అధికారులు తగిన పంటల ఎంపికపై మార్గదర్శకత్వం చేస్తున్నారని వివరించారు. వరి సాగును తగ్గించేందుకు విత్తన దుకాణాలు, డీలర్ల ద్వారా కూడా ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నామని, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను అందుబాటులో ఉంచి వరి విత్తనాల లభ్యతను తగ్గించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.గత ఏడాది సెప్టెంబర్‌తో పోలిస్తే ఈ ఏడాది సెప్టెంబర్‌లో విద్యుత్ వినియోగం 72.68 మిలియన్ యూనిట్లు పెరిగిందని తెలిపారు. వ్యవసాయ సర్వీసులకు రోజుకు సగటున 11 గంటల పాటు త్రీ-ఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని, విద్యుత్ నెట్‌వర్క్ బలోపేతానికి 862 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 35 ఫీడర్లు, ఆరు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ..** జిల్లాలో సాధారణం కంటే 5 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లాలోని 13 మండలాల్లో రుద్రంగి మినహా మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని వివరించారు. మధ్య మానేరు జలాశయంలో 23.42 టీఎంసీలు (85 శాతం), దిగువ మానేరు జలాశయంలో 15.45 టీఎంసీలు (64 శాతం), అప్పర్ మానేరులో 1.84 టీఎంసీలు (92 శాతం), అన్నపూర్ణ జలాశయంలో 1.59 టీఎంసీలు (45 శాతం), మల్కాపేట జలాశయంలో 1.24 టీఎంసీలు (41 శాతం) నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు ప్రతిరోజూ 59.41 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నామని, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో 135 ఎల్‌పీసీడీ చొప్పున తాగునీరు అందిస్తున్నట్లు వివరించారు. అత్యవసర పరిస్థితులు, పైప్‌లైన్ మరమ్మతుల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా కంట్రోల్ రూమ్‌లు, ప్రైవేట్ ట్యాంకర్లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

యాసంగి 2026-27 సీజన్‌లో వరి సాగు విస్తీర్ణాన్ని 1,90,988 ఎకరాల నుంచి 1,27,180 ఎకరాలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, వరికి బదులుగా 23,162 ఎకరాల్లో మొక్కజొన్న, 2,370 ఎకరాల్లో శనగ, 3,320 ఎకరాల్లో వేరుశనగతో పాటు ఆయిల్ పామ్, కూరగాయల సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని వివరించారు.వ్యవసాయ విద్యుత్ ఫీడర్లకు రోజుకు సగటున 12 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, 33/11 కేవీ సబ్‌స్టేషన్ల బలోపేతం, కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు ద్వారా విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.అక్టోబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు పశువులకు 3,28,475 మెట్రిక్ టన్నుల మేత అవసరం కాగా, 3,78,630 మెట్రిక్ టన్నుల మేత అందుబాటులో ఉందని తెలిపారు. 50,154 మెట్రిక్ టన్నుల మేర మిగులు మేత ఉందని వివరించారు. పశువుల తాగునీటి కోసం కొత్త నీటి తొట్ల నిర్మాణం, శిథిలావస్థలో ఉన్న తొట్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు.గ్రామీణ ఉపాధి హామీ నిధులతో ఫారంపాండ్లు, ఇంకుడు గుంతలు, బోరు రీచార్జ్ నిర్మాణాలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పిస్తూ నీటి సంరక్షణ ఆస్తులను అభివృద్ధి చేయడం ద్వారా రాబోయే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఈ సమీక్షలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రపుల్ దేశాయి, అదనపు కలెక్టర్ అశ్వినీ తానజీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల వ్యవసాయ, సాగునీటి, విద్యుత్, మిషన్ భగీరథ, భూగర్భ జలాలు, మార్కెటింగ్, పశుసంవర్ధక, మున్సిపల్ శాఖల అధికారులు, ఇతర సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నాయకులను సన్మానించిన కొయ్యల ఏమాజి

బెల్లంపల్లి, అక్టోబర్ 17, (మనం న్యూస్ ) : భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చ, ఓబిసి మోర్చలలో వివిధ పదవులు పొందిన బిజెపి నాయకులను బిజెపి రాష్ట్ర నేత, జడ్పీటీసీల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కృష్ణ దేవరాయలు, ఉపాధ్యక్షులు ఎరుకల నర్సింగ్, ఓబిసి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రామయ్య యాదవ్, కోయిల్కర్ గోవర్ధన్, జిల్లా కార్యదర్శి ఆకుల శంకర్ లను కొయ్యల ఏమాజి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. రాబోయే రోజుల్లో బెల్లంపల్లి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం అహర్నిశలు



కృషి చేస్తున్న వారికి పదవులు రావడం అభినందనీయం అన్నారు. మీకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యుడు శనిగారపు శ్రావణ్, పట్టణ ఉపాధ్యక్షుడు యుగంధర్, సీనియర్ నాయకులు రాములు, ఎస్సీ మోర్చ పట్టణ ప్రధాన కార్యదర్శి కనకం శ్రీనివాస్, రాజ్ కుమార్, గణేష్, ఆవుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ శాఖలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**-జిల్లా ఆయుష్ నోడల్ అధికారి**

నస్పూర్, అక్టోబర్ 17, (మనం న్యూస్ ) :ఆయుష్ శాఖ పరిధిలో పొరుగు సేవల పద్ధతిన వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఆయుష్ నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 4 మెడికల్ ఆఫీసర్, 1 ఫార్మసిస్ట్, 1 సైకోసోషల్ కౌన్సిలర్ (సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు), 1 యోగ ప్రొఫెషనల్, 3 మల్టీ పర్పస్ వర్కర్ (ఫీమేల్) పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం/ సంస్థ నుంచి ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, నేచురోపతిలో సంబంధిత విద్యార్హతతో పాటు తప్పనిసరి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని, ఫార్మసిస్ట్ పోస్టుకు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఫార్మా-డి అర్హతతో పాటు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో నమోదు అయి ఉండాలని, సైకోసోషల్ కౌన్సిలర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సోషల్ వర్క్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని, యోగ ప్రొఫెషనల్ పోస్టుకు సంబంధిత విభాగంలో నిర్దేశిత విద్యార్హతతో పాటు నేచురోపతి, యోగిక సైన్సెస్‌లో డిప్లొమా అర్హత ఉండాలని, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండి, సైకిల్ / మోటార్ సైకిల్ నడపగలగాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం వర్తించే సందర్భంలో, ఇతర అవసరమైన పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.

అర్హత పరీక్షలో మార్కులు, వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, మెరిట్ లిస్ట్ వెబ్ సైట్ లో ఉంచడం జరుగుతుందని తెలిపారు, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28వ తేదీన సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే ముందు అధికారిక నోటిఫికేషన్‌లోని పూర్తి నిబంధనలు, అర్హతలు, రిజర్వేషన్లు, ఎంపిక విధానాన్ని పరిశీలించాలని తెలిపారు.

# ఘనంగా కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ వర్ధంతి

బెల్లంపల్లి, అక్టోబర్ 17, (మనం న్యూస్ ) : బెల్లంపల్లి పట్టణంలో శనివారం ఎంసిపిఐయూ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 18వ వర్ధంతి వేడుకలు ఎంసిపిఐయూ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్మారక స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎంసిపిఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాద దోపిడి విధానాలకు ప్రత్యామ్నాయం మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానమే ఏకైక మార్గమని అన్నారు. అందుకోసం ముందుకు సాగుతున్న పార్టీ ఎంసిపిఐయూ మాత్రమే అన్నారు. 80 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో ఆకలి, దారిద్రం, నిరుద్యోగం, ఆత్మహత్యలు, అత్యాచారాలు, హింసతోపాటు కుల, మత బేధాలు, ప్రాంతీయ తత్వాలను పాలకవర్గాలు అనైతిక రాజకీయ విధానాలతో పెంచి పోషిస్తుందని అన్నారు. సెక్యులర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించినా ఆర్థిక దోపిడితో పాటు కులమత తత్వాలను పెంచి పోషించిందని అన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో మూడోసారి కేంద్రాన్ని పాలిస్తున్న బిజెపి మత భావాజాలన్నీ పెంపొందించుకుంటూ మైనార్టీ, దళిత, గిరిజన, అట్టడుగు వర్గాలపై మనువాద పాలన పేరుతో దాడులకు పూనుకుంటుందని అన్నారు. కార్పొరేట్, పెట్టుబడుదారి వర్గాలకు దేశ సంపదను ఆదాని, అంబానీలకు కట్టబెట్టిందని, తన మతోన్మాద పెట్టుబడుదారి, ఆర్థిక విధానాలను ప్రశ్నించిన వారిపై పాసిజంతో దురాహంకార పూరితమైన ఉన్మాద చర్యలకు పూనుకుంటుందని అన్నారు. ఎన్నికల కమిషన్,



న్యాయవ్యవస్థ లాంటి స్వతంత్ర వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకొని దేశ రాజకీయ వ్యవస్థలను కలుషితం చేస్తుందన్నారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష అంటూ ఒకే ఎన్నికల పేరుతో జమిలి ఎన్నికల విధానానికి తెర తీసి ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ విలువలను సమాధి చేస్తుందన్నారు. శ్రామిక వర్గ ఐక్య పోరాటాల బలోపేతానికి మార్క్సిజమే మార్గదర్శిగ తరతరాలుగా అసమానలతో అణిగిమనిగి ఉన్న భారత సమాజాన్ని అంబేద్కర్ ఆలోచన విధానంతో నిర్మూలించే దిశగా రాజకీయ, ఆర్థిక సామాజిక సమానత్వాన్ని బహుజనులకు రాజ్యాధికారాన్ని సాదించేందుకు ఎంసిపిఐయూ పార్టీ ముందుండి పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, మండల కార్యదర్శి సతీష్, మహిళ సమాఖ్య నాయకులు కాంపల్లి రాధ, దుర్గం లక్ష్మి, కామెర పద్మ, యువజన, విద్యార్థి నాయకులు నరేష్, శేఖర్, సాయి, రాం, మహేష్, ఆకాష్, అరుణ్ వివిధ మండలాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా వార్డు సభ్యులకు నూతన వస్త్రాలు అందచేత

కాసిపేట, అక్టోబర్ 17(మనంన్యూస్)బెల్లంపల్లి మండలం సోమగూడెం బి గ్రామ పంచాయతి సర్పంచ్ పొన్నాల మౌనిక, కనకరాజు, ఉప సర్పంచ్ ముత్తే విజయ భూమయ్య దంపతులు మహిళా వార్డు సభ్యులకు, పంచాయతి సిబ్బందికి నూతన వస్త్రాలు అందచేశారు. శనివారం పంచాయతి కార్యాలయం ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ, సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ల సందర్భంగా పాలకవర్గం సభ్యులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశం తో వారికి చిరు సహాయం అందించామని అన్నారు. పంచాయతి లోని అన్ని వర్గాల ప్రజలకు, మహిళలకు సద్దుల బతుకమ్మ వేడుకలు, దసరా పండుగ శుభకాంక్షలు



తెలియచేసుకుంటున్నామని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ప్రసాద్, వార్డు సభ్యులు విజయ రాజేశ్వరి, రాజ్యలక్ష్మి, శశి ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు జైన శ్రీనివాస్, దూడం మహేష్, తోట సురేష్, పొన్నాల అక్షయ్, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలయ, గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తా

( మొదటి పేజీ తరువాయి )

మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు అవసరమైన అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలారి నాగమణి రాజేష్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రవీందర్ రావు, పీఏసీఎస్ చైర్మన్లు ఏనుగుల మల్లారెడ్డి, మరిపల్లి శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ ప్రణయ్, ఎంపీడీవో చిరంజీవి, ఎంఆర్వో నాగార్జున, మాజీ ఏఎంసీ చైర్మన్ గనే రాజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుజ్జుల మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు కోలా శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేందర్ నాయక్, సర్పంచులు బెజ్జంకి మోహన్,మహేందర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, గ్రామ నాయకులు నారాయణ, బాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు కాయకల్ప అవార్డ్స్‌లో రావడం సంతోషం



బెల్లంపల్లి, అక్టోబర్ 17, (మనం న్యూస్ ) : కాయకల్ప అవార్డ్ 2025--26 కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఘన విజయాన్ని సాధించిందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం తన ఛాంబర్ లో టివివిపి వైద్యాధికారులను శాలువాతో సన్మానించి, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాయకల్ప అవార్డ్స్ 2025--26 కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి రన్నరప్‌గా నిలిచి రూ. 10 లక్షల నగదు బహుమతిని గెలుచుకోగా, చెన్నూర్ ఏరియా ఆసుపత్రి, లక్షెట్టిపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లు కమెండేషన్ అవార్డులతో పాటు ఒక్కొక్కటి లక్ష రూపాయల నగదు బహుమతిని సాధించాయని తెలిపారు. ఆసుపత్రులలో పారిశుధ్యం, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రి నిర్వహణ, ప్రమాణాల మెరుగుదలకు వైద్యులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ విజయంలో 3 ఆసుపత్రుల పర్యవేక్షకులతో పాటు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కృషి అభినందనీయమని తెలిపారు. ఆసుపత్రులలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల పర్యవేక్షకులు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాభ్యాసంలో పాల్గొన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి

రాయికల్, అక్టోబర్ 17(మనం న్యూస్) : రాయికల్ మండలం చింతలూరు గ్రామంలో దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలలో బాగంగా శనివారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ,బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తీ జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా చిన్నారులకు విద్యాభ్యాసం ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందని, విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ వనిత రమేష్,నవదుర్గా సేవాసమితి సభ్యులు,భక్తులు, పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ, భవానీ దీక్ష స్వాములు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# భూముల రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం



చిగురుమామిడి: అక్టోబర్ 17 (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే కార్యక్రమంలో భాగంగా శనివారం చిగురుమామిడి మండలంలోని ముదిమాణిక్యం, రామంచ గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచులు బోయిని రమేష్, ఒంటెల కిషన్ రెడ్డిల అధ్యక్షతన రైతన్నలకు శనివారం అవగాహన సదస్సులను నిర్వహించారు.ఈ సమావేశాలకు కరీంనగర్ ఏడి కిషన్ రావు,తహశీల్దార్ కనుకయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఏడి కిషన్ రావు మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో భాగంగా మొదటగా గ్రామ సరిహద్దులను, ప్రభుత్వ భూములను, రాస్తాలను, కెనాల్స్, ఇతర శాఖల భూముల హద్దులను గుర్తిస్తామని తెలిపారు.అనంతరం ప్రతి రైతు సమక్షంలో అత్యాధునిక అక్షాంశాలు, రేఖాంశాలతో కూడిన డిజిటల్ కొలతలు నిర్వహిస్తామన్నారు. రైతుల నుండి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్లను సేకరించి, ప్రతి భూమికి ఒక తాత్కాలిక నెంబర్,భవిష్యత్తులో శాశ్వత భూ ఆధార్ కార్డును జారీ చేస్తామని వివరించారు. రికార్డులకు, క్షేత్రస్థాయి విస్తీర్ణానికి ఏవైనా తేడాలుంటే నోటీసులు జారీ చేస్తామని,నోటీసు అందిన 60రోజులలోపు లైటిల్ పత్రాలతో అప్పీల్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.తహశీల్దార్ కనుకయ్య మాట్లాడుతూ ఈ భూముల రీ సర్వే వల్ల భవిష్యత్తులో భూ ఆక్రమణలను సులభంగా పసిగట్టవచ్చని,రైతులు సర్వే ఆఫీసుల చుట్టూ తిరిగే తిప్పలు తప్పుతాయని తెలిపారు.రాబోయే మూడు నెలల్లో ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు రైతులందరూ సర్వే సిబ్బందికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.తమ గ్రామాలను ఈ ప్రాజెక్ట్ కోసం ముందుగా ఎంపిక చేసినందుకు సర్పంచులు ప్రభుత్వం, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిఐ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి తాటిపెల్లి పున్నంచందర్ రెడ్డి,మండల సర్వేయర్ బాలమురళీ కృష్ణ, ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి,ఏఈఓ ప్రణయ్, స్థానిక ప్రజాప్రతినిధులు,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# రైతులకు మద్దతుగా ఈనెల 23న కలెక్టరేట్ ముందు బీజేపీ ధర్నా



శంకరపట్నం అక్టోబర్ 17 (మనం న్యూస్) : రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు.శనివారం శంకరపట్నం మండల కేంద్రంలోని మాదవసాయి గార్డెన్స్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజెపి మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. విద్యుత్ కొరత, సాగునీటి సమస్యల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, రైతులకు జరుగుతున్న నష్టానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాకు మండలం నుండి స్వచ్ఛందంగా రైతులు, బిజెపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.రైతుల సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, సర్పంచ్ వెన్నెం మల్లేష్, నాయకుకు దొంగల రాములు, జంగ జైపాల్, రామిడి ఆది రెడ్డి, రాసమల్ల శ్రీనివాస్, మందాడి జగ్గారెడ్డి, కనకం సాగర్, బిజిలి సారయ్య, చెర్ల శ్రీనివాస్ లతో పాటు వివిధ మోర్చాల మండలాధ్యక్షులు, శక్తికేంద్రం ఇంచార్జీలు, బూతు అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంథని గాంధీచౌక్ దుర్గాదేవి మండపంలో శరన్నవరాత్రి వేడుకలు



మంథని అక్టోబర్17 (మనం న్యూస్) మంథని గాంధీచౌక్ వద్ద భజరంగ్ యూత్ మంథని ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం అమ్మవారు మహాగౌరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది,యువ జనత ఫౌండేషన్ వ్యవస్థాపకులు బుద్దార్తి నవీన్-హారిక దంపతులు గాంధీచౌక్ అమ్మవారి మండపాన్ని, సనాతన్ సంస్థాన్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంథని ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.నిత్యం సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న బుద్దార్తి నవీన్ దంపతులు వేడుకల్లో పాల్గొనడం పట్ల స్థానిక యువకులు,భక్తులు అభినందనలు తెలిపారు.

# బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీఓ, సర్పంచ్



రామగిరి, అక్టోబర్ 17 (మనం న్యూస్): రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను శనివారం ఎంపీఓ మోతే సమ్మిరెడ్డి, సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పరిశీలించారు. గ్రామంలోని వాగు ప్రాంతంలో జేసీబీ సహాయంతో నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.ఆదివారం రాత్రి సద్దుల బతుకమ్మ పండుగ ముగింపు సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడిన అనంతరం వాగు ప్రాంతంలో నిమజ్జనం చేయనున్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ప్రాంతంలో లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భద్రపు ప్రవీణ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి గంగుల సంతోష్, స్థానిక నాయకులు పబ్బా వెంకటేష్, జక్కుల చందన్, ఖండే గట్టయ్య, సందేవెన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుడి నిర్మాణానికి పునాది వేసింది పుట్ట మధే

**- అందరి సహకారంతో త్వరలో ప్రారంభోత్సవం**

**- మాజీ ఎమ్మెల్యే, దేవాలయ చైర్మన్లకు సన్మానం**

రామగిరి, అక్టోబర్ 17 (మనం న్యూస్): రామగిరి మండలం నాగేపల్లి వెంకటేశ్వరస్వామి గుడి నిర్మాణానికి పునాది వేసింది మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకరే అని దేవాలయ చైర్మన్ వేగోలపు శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు. శనివారం నాగేపల్లి వెంకటేశ్వరస్వామీ దేవాలయం ఆవరణలో నెలకొల్పిన దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర ఆలయం ఇక్కడ పురుడుపోసుకున్నదంటే దానికి ప్రధాన కారణం పుట్ట మధూకరే అని కొనియాడారు. ఆయన మొదట రూ. 8 లక్షలు మండపం నిర్మాణానికి కేటాయించడంతో గుడి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, ఆయన స్ఫూర్తితో నిర్మాణం మొదలు పెట్టి బీఆరెస్ హయాంలోనే నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. అందరి సహకారంతో త్వరలోనే మిగతా పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవం చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం గుడి నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, ఆలయ చైర్మన్ వేగోలపు శ్రీనివాస్ గౌడ్, గద్దల శంకర్ లతో పాటు బీఆరెస్ మండల అధ్యక్షుడు శెంకేషి రవీందర్, మాజీ జడ్పీటీసీ మేదరబోయిన కుమార్ యాదవ్ లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేగోలపు రామాభాను నాయకులు కాపురబోయిన భాస్కర్, పుల్లెల కిరణ్, బుర్ర శంకర్ గౌడ్, ధర్ముల రాజసంపత్, పాశం ఓదెలు, గండి సత్యనారాయణ గౌడ్, ఆసం తిరుపతి, వేగోలపు మల్లన్న, దామెర శ్రీనివాస్, బొంకూరి పోచమ్, కాట అనిల్, మహేందర్, దుద్దిల్ల రాజు, పోలు సంతు, వేగోలపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించిన తెలంగాణ మజ్దూర్ యూనియన్

**-సంబరాలు జరుపుకున్న యూనియన్ నాయకులు**



మంథని అక్టోబర్ 17 (మనం న్యూస్) మంథని డిపోలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ మంథని డిపో సెక్రటరీ కేకే రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.తెలంగాణ మజ్దూర్ యూనియన్ జెండా ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో రిజియన్ నాయకులు ఐలయ్య,తెలంగాణ మంథని డిపో అధ్యక్షులు శేఖర్,సెక్రెటరీ కేకే రెడ్డి, నాయకులు మునీర్, తిరుపతి, సదవలయ్య,శ్రీనివాస్,టి.రవి,విజేందర్, జనార్దన్,విమల్, రాములు,గ్యారేజ్ సెక్రటరీ కృష్ణ, శ్రీనివాస్,విజయ్, మెకానిక్ విజయ్, ఖలీల్,చంద్రమౌళి, మండల్ శ్రీనివాస్, స్వామి,నీలా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మెట్‌పల్లి పట్టణ ఉపాధ్యక్షుడిగా జాజాల రాజ్‌గోపాల్



మెట్‌పల్లి అక్టోబర్ 17 ( మనం న్యూస్ ) కాంగ్రెస్ పార్టీ మెట్ పల్లి పట్టణ ఉపాధ్య క్షుడిగా జాజాల రాజ్ గోపాల్ నియామ కమయ్యారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గ ఇన్చార్జ్,తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొ రేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు ఆ యనను శాలువాతో సత్కరించి నియా మక పత్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా పార్టీ నాయకులు జాజాల రాజ గోపాల్ కు శుభా కాంక్షలు తెలిపారు. అ నంతరం రాజగోపాల్ మాట్లాడుతూ త నకు అప్పగించిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ బ లోపేతానికి కృషి చేస్తానన్నారు.తన ని యామకానికి సహకరించిన కోరుట్ల ని యోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జు వ్వాడి నర్సింగరావు, మెట్ పల్లి పట్టణ అధ్యక్షుడు ఎం.డి. రైసుద్దీన్, పట్టణ మై నారిటీ అధ్యక్షుడు జాకీర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.



# ఏక్లాస్‌పూర్‌లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

సైదాపూర్ అక్టోబర్ 17(మనం న్యూస్) : ఏక్లాస్‌పూర్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వెన్నంపల్లి శాఖ ఆధ్వర్యంలో ఏక్లాస్‌పూర్ గ్రామంలో ఆర్థిక సమ్మిళితత్వం, ప్రధానమంత్రి బీమా పథకాల ప్రాముఖ్యత, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం, బ్యాంకింగ్ సేవలు, సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. నుక్కడ్ నాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ కత్తి శ్రీనివాస్ , నాబార్డ్ డిడిఎం జయప్రకాశ్ , ఎల్ఎండి నందన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వెన్నంపల్లి శాఖ మేనేజర్ అంజన్న, టీజీబీ ఐఎఫ్ఎస్సి మేనేజర్ అడ్డగట్ల దేవరాజు, సీఎఫ్ఎల్ (వీడ్స్ ) కౌన్సిలర్ డి. కిషోర్, గ్రామ సర్పంచ్ శ్రీ మేకల భాగ్యలక్ష్మి క్రాంతి కుమార్ , ఉపసర్పంచ్ తాడవేని కార్తీక్ , పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, వార్డ్ సభ్యులు పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలను ఘనంగా నిర్వహించాలి





రామగిరి, అక్టోబర్ 17 (మనం న్యూస్): సింగరేణి రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఆధ్వర్యంలో ఆదివారం 18వ తేదీన నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలకు సంబంధించి తగిన ఏర్పాట్లను చేయాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.శనివారం ఆయన సెంటినరీ కాలనీలోని రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో సంబంధిత విభాగాలు చేస్తున్న ఏర్పాట్లను, అలాగే బొక్కల వాగు వద్ద ఏర్పాటు చేస్తున్న బతుకమ్మ ఘాట్ ను పరిశీలించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం నాడు సాయంత్రం 6 గంటల నుండి సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలను నిర్వహించబడునని, ఈ వేడుకల్లో భాగంగా బతుకమ్మ ఆట- పాటలు నిర్వహించడం కోసం తగిన ఏర్పాట్లు చేయడంమే కాకుండా ఉత్తమంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు ప్రధానం చేయబడునని అన్నారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాలనీ మహిళలు అధిక సంఖ్యలో బతుకమ్మలతో విచ్చేసి ఈ వేడుకలను జయప్రదం చేయవలసిందిగా కోరారు.ఈ వేడుకల్లో హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో పాటు పాటు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, బెల్లం శ్రీనివాస్, ఎస్సోటుజిఎం యం.రామ్మోహన్, సివిల్ డిజియం ఎస్.రవికుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అక్రమ జిలెటిన్ స్థావరంపై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడి

**-475 జిలెటిన్ స్టిక్స్ సీజ్, ఒకరు అరెస్ట్**



సైదాపూర్, అక్టోబర్ 17 (మనం న్యూస్): అక్రమంగా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచారన్న పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం మెరుపు దాడి నిర్వహించారు. సైదాపూర్ మండలం సోమారం గ్రామ శివారులో వ్యవసాయ బావి తవ్వకాల ముసుగులో అక్రమంగా పేలుడు పదార్థాలు వాడుతున్న స్థావరంపై దాడి చేసి భారీగా పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.ఏసీపీ సతీష్ పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో అనుమతులు లేకుండా బావి తవ్వకాలు జరుపుతున్న రామడుగు మండలం శ్రీరాములపల్లెకు చెందిన వేముల భూమయ్య అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి ఎలాంటి అనుమతులు లేని 475 జిలెటిన్ స్టిక్స్, సుమారు 3000 మీటర్ల డిటోనేటింగ్ వైర్ (3 బండిళ్లు) తో పాటు బావి తవ్వకానికి ఉపయోగిస్తున్న రెండు కంప్రెసర్ ట్రాక్టర్లను (ఖా 02 ఖజ 2690, ఖా 02 ఎ 0082) పోలీసులు సీజ్ చేశారు.స్వాధీనం చేసుకున్న సామగ్రిని, నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సైదాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్ఐలు సురేందర్, శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ సురేంద్ర, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాజయ్య, సాయిదీప్, విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు.అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు విక్రయించినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఏసీపీ సతీష్ హెచ్చరించారు.

# ప్రజలపై ఆర్టీసీ చార్జీల భారం మోపడం సరైనది కాదు




హుజురాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రజలపై ఆర్టీసీ చార్జీల భారం మోపడం సరైనది కాదని సిపిఎం పార్టీ హుజురాబాద్ మండల కార్యదర్శి కొప్పుల శంకర్ పేర్కొన్నారు. హుజురాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హుజురాబాద్ నుండి కరీంనగర్ ప్రయాణించే ప్రయాణికుల పై పెంచిన బస్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రయాణ సౌకర్యాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని, అలాంటిది సామాన్య ప్రజలకు సొంత వాహనాలు లేకుంటేనే ప్రజా రవాణా వ్యవస్థ పై ఆధారపడి ప్రయాణిస్తారని అన్నారు. ఒకపక్క నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోయి ఇప్పటికే ప్రజలపై అనేక భారాలు పడుతున్నాయని, దీనిని నియంత్రించాల్సిన ప్రభుత్వం, మరోపక్క నిత్యం వేలాదిమంది హుజురాబాద్ నియోజకవర్గం నుండి కరీంనగర్, వరంగల్ జిల్లా కేంద్రాలకు ప్రయాణిస్తారని, నేషనల్ హైవే పైన కొత్తగట్టు వద్ద ఏర్పటు చేసిన టోల్ గేట్ టోల్ టాక్సీ కి సంబంధించిన భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని అన్నారు. అట్టి భారాన్ని ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణికులపై వేయొద్దని, వెంటనే పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతోటి ప్రజలపై భారాలు మోపడం సరైనది కాదని, చార్జీలు తగ్గించకపోతే ప్రజాగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కదిరి రమేష్, వెంకట చంద్రయ్య, రాచపల్లి శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమాత వద్ద పెద్ద ఎత్తున మహా అన్నప్రసాదం ఏర్పాటు



చిగురుమామిడి: అక్టోబర్ 17 (మనం న్యూస్) : మండల కేంద్రంలోని శ్రీరామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గ మాత సన్నిధిలో చత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో శనివారం మహాఅన్నప్రసాద కార్యక్రమంను అత్యంత ఘనంగా నిర్వహించారు.గడ్డం సురేందర్ రెడ్డి,మంజుల అన్నదాతలుగా వ్యవహరించి వితరణ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ చత్రపతి శివాజీ యువసేన సభ్యులు ఇలాంటి దైవకార్యాలు, సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు.అన్నదాతల ఉదారత్వాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు.దుర్గ మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో దుర్గ మాత ఉత్సవ కమిటీ సభ్యులు, చత్రపతి శివాజీ యువసేన ప్రతినిధులు,ఆలయ అర్చకులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# గుడిపేటలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం



మల్యాల, అక్టోబర్ 17,( మనం న్యూస్ ) : మల్యాల మండలంలోని గుడిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గుడిపేట గ్రామ సర్పంచ్ ఇట్టిరెడ్డి శ్వేత అంజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మల్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐ రాజ్ కుమార్ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల గ్రామంలో శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ అదుపులో ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వ్యాపార సముదాయాలు, ఇళ్ల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క అనిల్, సర్వపూర్ సర్పంచ్ జంగిలి హనుమంత్, గుడిపేట ఉప సర్పంచ్ గొట్టె అనిత నరేష్, కాంగ్రెస్ నాయకులు మ్యాక లక్ష్మన్, మంద తిరుపతి గౌడ్, బండి రవి గౌడ్, స్థానిక వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేడే సద్దుల బతుకమ్మ

## సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి

## బెల్లంపల్లి పట్టణమంతా పూలమయం








బెల్లంపల్లి, అక్టోబర్ 17, (మనం న్యూస్) : తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన బతుకమ్మ పండుగ సంబరాలు బెల్లంపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బతుకమ్మ అంటేనే పూలను పూజించే గొప్ప తెలంగాణ పండగ కావడంతో మహిళలంతా తొమ్మిది రోజులపాటు ఆడి పాడి బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరుగుతుంది. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ బతుకమ్మ పండుగను ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతకమ్మ, నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మగా పిలుచుకుంటూ ఆ గౌరీ మాతకు ప్రత్యేక పూజలు ప్రసాదాలతో అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరుగుతుంది. ఈ బతుకమ్మ వేడుకలను బెల్లంపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పోచమ్మ చెరువు వద్ద సద్దుల బతుకమ్మ సంబరాలను ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించడం జరుగుతుంది. ఈ సద్దుల బతుకమ్మ సంబరాలు మహిళలు పేర్చిన బతుకమ్మలకు తీసుకొని అక్కడికి వచ్చి వేలాదిమంది మహిళలతో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. బతుకమ్మలకు బహుమతుల ప్రధానం చేయడం జరుగుతుంది. నేడు సద్దుల బతుకమ్మ కావడంతో బెల్లంపల్లి పట్టణంలో చుట్టూరు పరిసర ప్రాంతాల నుండి వేలాదిమంది పూల వ్యాపారులు శనివారం నుండే పూల అమ్మకాలు ప్రారంభించారు. దీంతో బెల్లంపల్లి పట్టణమంతా పూలమయంగా మారిపోయింది.

# సర్పంచుల చేతులమీదుగా లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డుల అందజేత



నెన్నెల, అక్టోబర్ 17 (మనం న్యూస్): అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో నెన్నెల మండలంలోని కొత్తూర్, చిన్నవెంకటాపూర్ గ్రామాల లబ్ధిదారులకు శనివారం డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కొత్తూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు లబ్ధిదారులకు నూతన డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నవెంకటాపూర్ సర్పంచ్ జలంపెల్లి భాస్కర్, కొత్తూర్ సర్పంచ్ తలండి రాజేశ్వరి--పోషమల్లు పాల్గొని లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. నూతన డిజిటల్ రేషన్ కార్డులు అందుకోవడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. డిజిటల్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, రేషన్ డీలర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మహా చండీ హోమం

ఇల్లందకుంట, అక్టోబర్ 17 (మనం న్యూస్): ఇల్లందకుంట మండల కేంద్రంలోని దుర్గామాత మండపం వద్ద శనివారం మహాచండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో, వేదమంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. దుర్గాదేవి స్వరూపమైన చండీమాత అనుగ్రహం పొందాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన, అమ్మవారి ప్రత్యేక అర్చనలు నిర్వహించిన అనంతరం వేదపండితుల శ్రీహర్ష చార్యులు ఆధ్వర్యంలో మహా చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. దేవీ మాహాత్మ్య పారాయణం, వేదమంత్రాల పఠనంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం పూర్ణాహుతి, మహా హారతి కార్యక్రమాలను నిర్వహించారు.

లోకకల్యాణం, సకల జనుల శ్రేయస్సు, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలుసుఖసంతోషాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. మహా చండీ హోమంలో పాల్గొనడం ద్వారా అమ్మవారి ఆశీస్సులు లభిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శేషచార్యులు, వంశీ, రాము, మాజీ ఎంపీటీసీ కటంగూరీ రామ్ స్వరన్ రెడ్డి, భవాని స్వాములు గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# నేడు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటన

మంథని అక్టోబర్17 (మనం న్యూస్) మంథని పట్టణంలో ఉదయం9 గంటలకు పలు కార్యక్రమంలలో రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల.శ్రీధర్ బాబు హాజరు కానున్నారు ఆదివారం మధ్యాహ్నం 1 గంటలకు మంథని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అలీఫ్,డిఆర్డిఏ/మెప్మా/సిఎస్ఆర్ ద్వారా మంథని మున్సిపల్ పరిధిలో కుట్టు మిషన్లు ఏర్పాటుచేసి 600 మందికి ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసిన వారికి మంత్రి శ్రీధర్ బాబు సర్టిఫికెట్లను పంపిణీ చేయనున్నారు. మంథని నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు 3040 మందికి కుట్టు మిషన్ ఉచిత కోచింగ్ తీసుకోగా,వారికి సర్టిఫికెట్లు కూడా అందజేశారు.కోటి రూపాయలు విలువచేసే 302 మందికి సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు(మెప్మా ఆధ్వర్యంలో)మహిళా ఇందిరా శక్తి కింద మంజూరైన నూతన ఆయిల్ మిల్ (మున్సిపల్ కార్యాలయం దారిలో ) ప్రారంభోత్సవం చేయనున్నారు. అనంతరంమహాలక్ష్మి దేవాలయంలోని అమ్మవారిని మంత్రి శ్రీధర్ బాబు దర్శించుకొనున్నారు.

# అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి



మంథని అక్టోబర్17 (మనం న్యూస్) దుర్గామాత అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వేడుకున్నారు. దుర్గాదేవీ నవరాత్రోత్సవాల్లో బాగంగా మంథని పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో శ్రీ దుర్గాదేవి సంస్థాన్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో మంథని నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో,సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం పుట్ట దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో వారు దీక్షాపరులకు స్వయంగా బిక్ష వడ్డించారు. అనంతరం దీక్షాపరులు పుట్ట దంపతులను శాలువాతో సత్కరించి మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యులుగా మూడోసారి ముచ్చటగా శశిభూషణ్ కాచే



మంథని అక్టోబర్17 (మనంన్యూస్) తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యులుగా, మంత్రి శ్రీధర్ బాబుకు అత్యంత సన్నిహితులుగా, మంథనికి చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త, శశిభూషణ్ కాచే మూడవసారి ముచ్చటగా నియమితులైనారు. శనివారం శశి భూషణ్ కాచెను తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యులుగా శశిభూషణ్ కాచేను నియమిస్తూ ఆ కమిటీ కమిషన్ కార్యదర్శి వి. రామచందర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ కమిటీ కాల వ్యవధి మూడు సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించనున్నారు. విద్యుత్తు రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై సలహాలు, సూచనలు అందించే కీలక కమిటీలో శశి భూషణ్ కాచేకు మరోసారి అవకాశం లభించింది.మంథని ప్రాంతంలో ఆయనకున్న అనుభవం కమిటీ బాధ్యతల నిర్వహణలో ఎంతో ఉపయోగపడుతుంది.తన నియమకానికి సహకరించిన కమీషన్ చైర్మన్, జస్టిస్ దేవరాజు నాగార్జున్,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్రఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల. శ్రీధర్ బాబు,టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబులకు శశి భూషణ్ కాచే కృతజ్ఞతలు తెలిపారు.

# గౌరీ దేవి ప్రత్యక్ష దైవం... బతుకమ్మ

**-నేడే సద్దుల బతుకమ్మ**

శంకరపట్నం అక్టోబర్ 17 మనం న్యూస్ : తెలంగాణలో జరుపుకునే ప్రసిద్ధ పూల పండుగ బతుకమ్మ. ఈ పండుగ వెనుక ప్రధానంగా రెండు రకాల పౌరాణిక, చారిత్రక కథలు ప్రచారంలో ఉన్నాయి:

1. ధర్మాంగద మహారాజు కథ (రాకుమారి కథ)

చోళ వంశానికి చెందిన ధర్మాంగద మహారాజు మరియు సత్యవతి దంపతులకు నూరుగురు కుమారులు యుద్ధంలో మరణిస్తారు. సంతానం లేక వారు తీవ్రంగా పరితపించి, లక్ష్మీదేవిని తమ కుమార్తెగా ప్రసాదించాలని తపస్సు చేస్తారు. వారి కోరిక మేరకు లక్ష్మీదేవి ఆ దంపతులకు కుమార్తెగా జన్మిస్తుంది.ఆ చిన్నారి ఎన్నో ప్రాణాంతక ప్రమాదాల నుండి బయటపడటంతో, బతకాలనే ఉద్దేశంతో ఆమెకు 'బతుకమ్మ' (అంటే 'అమ్మా బతుకు' / 'జీవించు తల్లీ') అని నామకరణం చేస్తారు. ఆమె గౌరవార్థం ఈ పూల పండుగను ప్రారంభించారని చెబుతారు.

2. పార్వతీ దేవి (గౌరమ్మ) కథ

మహిషాసురుడితో భీకర యుద్ధం చేసి అలసిపోయిన పార్వతీ దేవి (గౌరీ దేవి) అశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజున గాఢ నిద్రలోకి (యోగ నిద్ర) వెళ్తుంది.ఆమె తిరిగి మేల్కొనాలని భక్తులు, మహిళలు భక్తితో "బతుకమ్మ" అంటూ ప్రార్థిస్తారు. ఆమె నవదశమి రోజున తిరిగి కళ్ళు తెరుస్తుందని, అందుకే ఈ తొమ్మిది రోజుల పండుగను ప్రకృతిని, గౌరీదేవిని పూజించేలా జరుపుకుంటారని విశ్వాసం.



**పండుగ విశేషాలు:**

సమయం: భాద్రపద అమావాస్య (మహాలయ అమావాస్య) నుండి అశ్వయుజ శుద్ధ అష్టమి (సద్దుల బతుకమ్మ) వరకు 9 రోజుల పాటు నిర్వహిస్తారు.

పూల అమరిక: తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలను ఆలయ గోపురాకారంలో పేర్చి మధ్యలో పసుపుతో గౌరమ్మను తయారు చేసి పూజిస్తారు.

**తొమ్మిది రోజుల బతుకమ్మ పేర్లు:**

మొదటి రోజు: ఎంగిలి పూల బతుకమ్మ (పెత్రామస)
రెండో రోజు: అటుకుల బతుకమ్మ
మూడో రోజు: ముద్దపప్పు బతుకమ్మ
నాలుగో రోజు: నానబియ్యం బతుకమ్మ
ఐదో రోజు: అట్ల బతుకమ్మ
ఆరో రోజు: అలిగిన బతుకమ్మ
ఏడో రోజు: వేపకాయల బతుకమ్మ
ఎనిమిదో రోజు: వెన్నముద్దల బతుకమ్మ
తొమ్మిదో రోజు: సద్దుల బతుకమ్మ

# ఎస్‌జీఎఫ్ఐ తైక్వాండో పోటీల్లో కేపీఎస్ విద్యార్థినుల సత్తా

**-ఇద్దరికి బంగారు పతకాలు.. మరొకరికి కాంస్య పతకం**

కోరుట్ల, అక్టోబర్ 17 (మనం న్యూస్) : ఎస్‌జీఎఫ్ఐ తైక్వాండో పోటీల్లో కోరుట్ల పబ్లిక్ స్కూల్ (కేపీఎస్) విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థినులు బంగారు పతకాలు సాధించగా, రాష్ట్రస్థాయి పోటీల్లో మరో విద్యార్థిని కాంస్య పతకం కైవసం చేసుకుని పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ నెల 10వ తేదీన జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన యునైటెడ్ కరీంనగర్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ తైక్వాండో సెలక్షన్స్ కమ్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-14 బాలికల విభాగంలో అండర్-26 కిలోలు, అండర్-28 కిలోల వెయిట్ కేటగిరీల్లో జరిగిన ఫైటింగ్ పోటీల్లో కేపీఎస్ విద్యార్థినులు సుతారి శాన్విత, అయేషా మరియం ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా, వికారాబాద్ జిల్లా పరిగి మండల కేంద్రంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి తైక్వాండో సెలక్షన్స్ కమ్ ఛాంపియన్‌షిప్‌లో కేపీఎస్ విద్యార్థిని పోగుల అమిత్యా అండర్-17 బాలికల విభాగంలో అండర్-52 కిలోల వెయిట్ కేటగిరీ ఫైటింగ్ పోటీల్లో పాల్గొని కాంస్య




పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి ఎండీ కాజా చేతుల మీదుగా ఆమె పతకాన్ని అందుకుంది. ఈ విజయాలపై కోరుట్ల పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేష్ హర్షం వ్యక్తం చేస్తూ, విద్యార్థినులు క్రీడల్లో సాధించిన విజయాలు పాఠశాలకు, కోరుట్ల పట్టణానికి గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదలతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థినులను కేపీఎస్ తైక్వాండో మాస్టర్ నవనంది రమేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర కార్యవర్గంలో మండల ఉపాధ్యాయులకు చోటు

దండేపల్లి అక్టోబర్ 17 (మనం న్యూస్) : పిఆర్‌టియుటిఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గంలో మండల ఉపాధ్యాయులకు చోటు దక్కింది. ఇటీవల నల్గొండలో జరిగిన ఆరవ కౌన్సిల్ సమావేశంలో మండలానికి చెందిన ఉపాధ్యాయులు పదవులు స్వీకరించారు. రాష్ట్ర స్టేట్ అధ్యక్షులుగా పాత రమేష్, నక్క విజయ్ చందర్, బండారి శ్రీనివాస్, మహిళా కార్యదర్శిగా నమ్మాల మల్లేశ్వరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆవుల నరసింహులు, సయ్యద్ ఉద్దీన్, పోలంపల్లి శ్రీనివాస్, ఎన్నికైనట్లు సంఘం మండల అధ్యక్షుడు రావణవేణి రవి తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ సంఘం బలోపేతానికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముందుండి నడిపించాలని కోరారు.



# ప్రత్యామ్నాయ పంటలతో అధిక లాభాలు

**- ప్రభుత్వ విప్ విజయరమణ రావు**

కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 17 (మనం న్యూస్) : కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో 50 మంది లబ్ధిదారులకు రూ.50 లక్షలకు పైగా విలువగల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి పథకం అమలులో ప్రభుత్వం ఎక్కడా నిర్లక్ష్యం చేయలేదని, గత 34 నెలలుగా అర్హులందరికీ సకాలంలో చెక్కులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ పథకంపై ప్రతిపక్షాలు కావాలనే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. రైతులు యాసంగిలో వరి పంటనే నమ్ముకోకుండా మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చని సూచించారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రం, శ్రీరాంపూర్.రాయపేటలో ఏర్పాటు చేసిన బతుకమ్మ



విగ్రహాలను ఆవిష్కరించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని కొనియాడారు. మల్యాల గ్రామంలో దుర్గామాత ఆలయాన్ని దర్శించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గాజర వీణ సదయ్య మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి సర్పంచులు ఉప సర్పంచులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

మెట్‌పల్లి అక్టోబర్ 17 ( మనం న్యూ స్ ) రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చే యాలాని, ఎండిపోతున్న పంటలను కా పాడాలాని మెట్ పల్లి బిఆర్ఎస్ నాయ కుల డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎ మ్మెల్యే క్యాంపుకార్యా లయంలో శనివా రంవారువిలేకరులతోమాట్లాడుతూ.ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆదేశాలతొ పాత్రికేయుల సమావేశం నిర్వహించా మన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్నారు, సాగు నీరు, విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంద ని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ రా ష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలంటే రై తులకు నిరంతర విద్యుత్ సరఫరాచేయ డంతో పాటు, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ ఎస్ ప్రభుత్వహయాంలో విద్యుత్ రం గం, సింగరేణి సంస్థకు సంబంధించి సా ధించిన ప్రగతిని ప్రస్తావిస్తూ, ప్రస్తుత కాం గ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రవిద్యు త్ వ్యవస్థ సంక్షోభంలోకి వెళ్తోందనినాయ కులు విమర్శించారు. సింగరేణి నుంచి బొగ్గు సరఫరా సక్రమంగా జరిగితే విద్యు త్ ఉత్పత్తికి మద్దతు లభిస్తుందని, ఈ అంశంపై రాష్ట్ర




ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.సింగరేణి సంస్థ ప్రైవేటీకరణ జరిగితేతెలంగాణ రైతాంగానికి మరిన్ని ఇబ్బందులు ఎదు రయ్యే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళనవ్యక్తం చేశారు. రైతులకు పంట నష్టం జరగకుండా వెంటనే విద్యుత్ సర ఫరానుమెరుగుపరచాలని,సాగు నీటిని విడుదలచేయాలనిడిమాండ్ చేశారు. రై తుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరా టం కొనసాగిస్తుందని తెలిపారు.ఈ స మావేశంలో మాజీ వైస్ చైర్మన్ బోయిన పల్లి చంద్రశేఖర్ రావు, తిరుపతిరెడ్డి, ఏ నుగందుల శ్రీనివాస్ గౌడ్, సుధాకర్ గౌడ్, విష్ణు, జావిద్, భీమనాతి సత్యనారాయ ణ, ఆకుల ప్రవీణ్, మొరపు తేజ, సుద్దా ల రాజేశ్వర్ గౌడ్, మహేందర్, చిరంజీవి తదితరులున్నారు .

# సద్దుల బతుకమ్మ వేడుకలకు సిద్ధమైన వెన్నంపల్లి

కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 17 (మనం న్యూస్):కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామం సద్దుల బతుకమ్మ వేడుకలకు మ-ుస్తాబైంది.గ్రామ సర్పంచ్ కలవేన రమ-రమేష్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని మహిళలందరూ ఒకే చోట చేరి సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆటలు ఆడుకునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.బతుకమ్మ ఆడుకునే ప్రాంగణాన్ని శుభ్రం చేయించి చదును చేయించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ దీపాలతో లైటింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ



పండుగను గ్రామంలో ఘనంగా నిర్వహించేందుకు సర్పంచ్ ముందుండి ఏర్పాట్లు చేయడం పట్ల గ్రామ ప్రజలు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సద్దుల బతుకమ్మ రోజున పెద్ద ఎత్తున మహిళలు హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి

మంథని అక్టోబర్17 (మనం న్యూస్) : పెద్దపల్లి జిల్లామంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన రాంపల్లి రామారావు అనారోగ్యంతో మృతి చెందగా మృతుని కుటుంబ సభ్యులను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు పరామర్శించారు. రామారావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.



# జరిమానా చెల్లించి వ్యాపార లైసెన్సు పొందిన ఎస్.వి మార్ట్,ఎలక్ట్రానిక్స్ సూపర్ మార్కెట్ యజమాని

మంథని అక్టోబర్17 (మనం న్యూస్) మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఎస్.వి మార్ట్,ఎల క్ట్రానిక్స్ సూపర్ మార్కెట్ షాపు యాజమాన్యం మున్సిపల్ శాఖ విధించిన రూ.50,000/- జరిమా నాను శనివారం చెల్లించడంతో పాటు, రూ.20,000/- రుసుము చెల్లించి వ్యాపార లైసెన్సును పొందారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్ మాట్లాడుతూ, మంథని మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులందరూ తప్పనిసరిగా మున్సిపల్ శాఖ నుండి వ్యాపార లైసెన్సులు పొందాలని సూచించారు. వ్యాపార లైసెన్సులు లేకుండా దుకాణాలు నిర్వహించే వారిపై క్షేత్రస్థాయిలో తనిఖీలు(ఫీల్డ్ వెరిఫికేషన్) నిర్వహించి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు.కాగా మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారస్తులందరూ సకాలంలో వ్యాపార లైసెన్సులు పొందుతూ, మున్సిపల్ నిబంధనలను పాటించాలని కమిషనర్ మనోహర్ కోరారు.





# ప్రశాంతంగా దసరా ఉత్సవాలు జరుపుకోవాలి : ఏసీపీ గజకృష్ణ

కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 17 (మనం న్యూస్): కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను పెద్దపల్లి ఏసీపీ గజకృష్ణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సహకరించాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో తాను కాల్వ శ్రీరాంపూర్ లో ఎస్సైగా పనిచేశానని, ఇక్కడి గ్రామాలు తనకు సొంత ఊరితో సమానమని ఏసీపీ పేర్కొన్నారు. మండల ప్రజలతో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, పొత్కపల్లి ఎస్సై, కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై గట్ల సుధాకర్, పోలీస్ సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# రూ.66.66 లక్షల కరెన్సీ నోట్లతో దుర్గామాత అలంకరణ



బెల్లంపల్లి, అక్టోబర్ 17, (మనం న్యూస్ ) : బెల్లంపల్లి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ వాసవీ మాత మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ. 66, 66,666 విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి గర్భాలయం, మూలవిరాట్టును వివిధ విలువల కరెన్సీ నోట్లతో సుందరంగా అలంకరించారు. నోట్లతో రూపొందించిన తోరణాలు, హారాలు ఆలయానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. ధనధాన్య ప్రదాయిని అయిన మహాలక్ష్మి దేవి అలంకరణలో కొలువుదీరిన వాసవీ మాతను దర్శించుకునేందుకు పట్టణంతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులు బారులుతీరి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, దీపారాధనలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్మాస్ సంతోష్ కుమార్, గౌరవ అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులు తాటిపెల్లి సత్యనారాయణ, ఎలుక వెంకటేశ్వర్, ప్రధాన కార్యదర్శులు కొడితాల బాలప్రసాద్, తనుకు నవీన్, నరేందుల రామకృష్ణ, ఉపాధ్యక్షులు చిలువేరు శ్రీధర్, నరేందుల వేణుగోపాల్, అదనపు ప్రధాన కార్యదర్శి కౌటారపు గణేష్, కోశాధికారులు కొడిప్యాక మురళీమోహన్, తనుకు నందయ్య, భీరెల్లి ప్రభాకర్, సహాయ కార్యదర్శులు పెద్ది మహేష్, నరేందుల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# దసరా కానుక.. నిత్యావసర వస్తువులు పంపిణీ



రామగిరి, అక్టోబర్ 17 (మనం న్యూస్): దసరా పండుగను పురస్కరించుకుని శనివారం కల్వచర్ల హొగ్రామపంచాయితీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకగా నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి మాట్లాడుతూ. నిత్యం గ్రామాన్ని పరిశుభ్రంగా కాపాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పండుగ వేళ వారి సేవలను గుర్తించి, కుటుంబాలతో కలిసి దసరాను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిత్యావసర సరుకులను అందజేసినట్లు తెలిపారు. పండుగ పూట కార్మికుల ముఖాల్లో ఆనందం నింపేందుకు స్వయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టమన్నారు. ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య కార్మికులకు సహకరిస్తూ గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు భాగస్వాములు కావాలని సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి హొరారు. పండుగ వేళ తమను గుర్తుంచుకుని నిత్యావసరాలు పంపిణీ చేసినందుకు గ్రామపంచాయితీ కార్మికులు సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హొష్ట మహేందర్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరోపణలు నిరూపించేందుకు బహిరంగ చర్చకు సిద్ధం

**- సీఐటీయూ నాయకుడు తుమ్మల రాజారెడ్డి**

**-కార్మిక సమస్యలపై అన్ని సంఘాలు చర్చకు రావాలి**

**-ఏఎల్పీలో సీఐటీయూ గేట్ మీటింగ్‌హొ**



రామగిరి, అక్టోబర్ 17(మనం న్యూస్): తనపై, సీఐటీయూపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న సంఘాల నాయకులు ఆధారాలతో సహా బహిరంగ చర్చకు రావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి సవాల్ విసిరారు. ఆర్జీ-3 పరిధిలోని ఏఎల్పీ గనిలో పిట్ సెక్రటరీ దేవర రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.హొనపై తప్పుడు పోస్టులు పెడుతూ, ఇతర సంఘాల నాయకులు వాటిని ప్రచారం చేస్తున్నారని రాజారెడ్డి ఆరోపించారు. తాను ఎమ్మెల్యేకు అనుకూలంగా పనిచేస్తున్నానని, డబ్బులు తీసుకుని వ్యవహరిస్తున్నానని, భూములు ఆక్రమించుకున్నానని పేర్లు, వివరాలు వెల్లడించకుండా కొందరు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరోపణలు చేసేవారికి నిజంగా ధైర్యం ఉంటే ప్రెస్ క్లబ్‌లో బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు.హొను 12.5 ఎకరాల భూమిని దళితులకు పంచిన చరిత్ర ఉందని రాజారెడ్డి పేర్కొన్నారు. గత 30 ఏళ్లలో తాను గానీ, తన సంఘం నాయకులు గానీ పనులు చేయించి లంచాలు తీసుకున్నట్లు నిరూపిస్తే శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు. ఇతర సంఘాలు, వాటి నాయకులపై తాను చేసే ఆరోపణలను కూడా కార్మికుల సమక్షంలో నిరూపించేందుకు సిద్ధమని, అందుకు వారు సిద్ధమేనా అని ప్రశ్నించారు.హొర్మికుల హక్కుల కోసమే పోరాటంహొసీఐటీయూ నిజాయతీగా కార్మికుల పక్షాన నిలుస్తుండటంతోనే ఇతర సంఘాలు తమ ఎదుగుదలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని రాజారెడ్డి ఆరోపించారు. ఏఐటీయూసీ గెలుపునకు ఐఎన్‌టీయూసీ, మరో సందర్భంలో టీబీజీకేఎస్ మద్దతు ఇవ్వడం, వాటికి హెచ్ఎంఎస్ అండగా నిలవడం వెనుక సీఐటీయూను బలహీనపరిచే ఉద్దేశం ఉందని విమర్శించారు. కార్మిక సంఘాల మధ్య విభేదాలు ఉన్నట్లు బయటకు చూపిస్తూ, మరోవైపు సీఐటీయూ నాయకుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.హొ1998 నుంచి ఇప్పటివరకు గుర్తింపు లేదా ప్రాతినిధ్య సంఘాలుగా వ్యవహరించిన సంఘాలు కార్మికులకు చేసిన ఒప్పందాల్లోని లోపాలను ప్రజలకు తెలియజేస్తూ సీఐటీయూ పోరాటం చేస్తోందని తెలిపారు. కార్మికులకు సొంతింటి కల సాకారం చేయడమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని, గత కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించే దిశగా ఉందని పేర్కొన్నారు.హొన్నికలకు ముందు కొన్ని సంఘాలు కార్మికుల సమస్యలపై హామీలు ఇస్తూ నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. రాజకీయ జోక్యంతో సింగరేణి సంస్థను బలహీనపరిచే విధానాలకు మద్దతు ఇస్తున్న సంఘాలకు రానున్న ఎన్నికల్లో కార్మికులు తగిన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.హొఈ కార్యక్రమంలో ఆర్జీ-3 కార్యదర్శి దొమ్మటి కొమురయ్య, నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, ఎద్దు కుమార్, ఎం. ప్రభాకర్, ఎం.డి. అహ్మద్ పాషా, కె. వేణుగోపాల్, కారం సత్తయ్య, రాజేశం, ఎం. సదానందం, ప్రవీణ్, కె. రాజేష్, ఇందూరి శ్రీనివాస్, ప్రశాంత్, హబీబ్ పాషా, రాజకుమార్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# గుండారం రిజర్వాయర్‌లోకి సాగునీరు విడుదల

**-శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ డీ-83 కాలువ ద్వారా నీటి సరఫరా**

**-మంత్రి శ్రీధర్ బాబు కృషితో రైతులకు మేలు**

**- మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్**



రామగిరి,అక్టోబర్ 17(మనం న్యూస్):మంథని నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించేందుకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ డీ-83 కాలువ ద్వారా గుండారం రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేశారు. శనివారం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, కమాన్‌పూర్, రామగిరి, పెద్దపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఎస్సారెస్పీ అధికారులతో కలిసి నీటి విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.హొమంత్రి శ్రీధర్ బాబు చొరవతోనే..హొఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతోనే రైతులకు సాగునీరు అందుతోందని తెలిపారు. పంటలు ఎండిపోకుండా, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో మంత్రి ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రితో మాట్లాడి సాగునీటి విడుదలకు కృషి చేశారని పేర్కొన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మంథని, పెద్దపల్లి ప్రాంతాల రైతులకు మేలు చేసిన మంత్రికి రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.హొబీఆర్ఎస్ విమర్శలకు సాగునీటి విడుదలే సమాధానంహొకాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్, సాగునీటి సరఫరా ఉండదంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారానికి గుండారం రిజర్వాయర్‌లోకి నీటి విడుదలే సమాధానమని తిరుపతి యాదవ్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గమనించాలని పేర్కొన్నారు.హొరైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యంహొకాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని తొట్ల తిరుపతి యాదవ్ స్పష్టం చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.హొఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, రామగిరి మండల మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క, కొమురయ్య గౌడ్, రామగిరి మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కండె పోషం, కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, గుండారం సర్పంచ్ జంగిలి పోశాలు, నాగేపల్లి మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, గుండారం గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు శంకర్, కాంగ్రెస్ నాయకులు బర్ల శ్రీకాంత్, గొల్లపల్లి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను



కోరుట్ల అక్టోబర్ 17 (మనం న్యూస్) : విజయదశమి పండగ పురస్కరించుకొని పలు దుర్గామాత మండపాలను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కుమార్ శనివారం దర్శించుకుని రాష్ట్ర ప్రజల సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కోరుట్ల పట్టణంలోని అనేక దుర్గామాత మండపాలలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలతో వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం నుండి తగు డబ్బును నిత్యవసర వస్తువులను నీటిని విద్యుత్తును పొదుపుగా జాగ్రత్తలు వాడుకోవాలని సూచించారు. అమ్మవారి అనుగ్రహంతో వచ్చే ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి మళ్ళీ పూర్వ వైభవం కంటే అందరం బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కౌన్సిలర్లు, కార్యకర్తలు ఉన్నారు.

# రైతాంగానికి అండగా నిలుద్దాం



మల్యాల, అక్టోబర్ 17,( మనం న్యూస్) : రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగం పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వ మొద్దు నిద్రను మట్టుబెట్టేందుకే ఈనెల 23న కలెక్టరేట్ ఎదుట భారీ ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ స్పష్టం చేశారు. బీజేపీ మల్యాల మండల అధ్యక్షులు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి గుజ్జ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేతికి వచ్చిన పంట సాగునీరు లేక కళ్ల ముందే ఎండిపోతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం బావుల కింద ఉన్న నీళ్లతోనైనా పంటలను కాపాడుకుందామని రైతులు తాపత్రయపడుతుంటే, అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను తీవ్ర గోస పెడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతాంగానికి చిన్నచూపే దక్కిందని దుయ్యబట్టారు. పంటలను, రైతులను ఆదుకోవాల్సిన బాధ్యతను విస్మరించి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, నిద్రమత్తులో ఉన్న ఈ ప్రభుత్వానికి కన్నువిప్పు కలిగించేందుకే బీజేపీ ఆధ్వర్యంలో 23న ధర్నా కార్యక్రమాన్ని తలపెట్టామని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించే ఈ పోరాటంలో రైతాంగం, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ వక్కలభరణం మౌర్య, ప్రధాన కార్యదర్శి పిల్లి రాజశేఖర్, పొన్నం సాయికుమార్ గౌడ్, బోట్ల ప్రసాద్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సామ మైపాల్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు కటకం లత, వన్ హాస్పిటల్ అధినేత మరి మహేష్, ఉపాధ్యక్షులు గుగ్గిళ్ళ గంగరాజు, కిల్లెటి రమేష్, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తనిఖీలకు వచ్చిన అధికారులకు లాడ్జి వసతి..!

### రా రైస్ మిల్లర్ల ఏర్పాట్లపై విమర్శలు...

### అధికారుల పర్యటనలో ఆతిథ్యంపై చర్చ...

### స్థానికంగా చర్చనీయాంశంగా మారిన టాస్క్‌ఫోర్స్ అధికారుల బస వ్యవహారం...




జమ్మికుంట, అక్టోబర్ 17 (మనం న్యూస్): రా రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించేందుకు వచ్చిన టాస్క్‌ఫోర్స్ అధికారులకు స్థానిక రైస్ మిల్లు నిర్వాహకులు ఒకరోజు స్థానిక లాడ్జిలో బస చేసేందుకు ఏర్పాట్లు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులకు తనిఖీల పరిధిలోకి వచ్చే మిల్లుల నిర్వాహకులే వసతి సౌకర్యాలు కల్పించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు స్థానికుల నుండి బలంగా వినిపిస్తున్నాయి. వివరాలకు వెళ్తే... జమ్మికుంట, హుజురాబాద్, ఇల్లందకుంట మండలాలలోని రా రైస్ మిల్లుల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్(టాస్క్ ఫోర్స్) డీఎస్పీ ఆధ్వర్యంలో గత మంగళవారం, బుధవారం రెండు రోజులపాటు ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం, మరాడించి పెట్టాల్సిన బియ్యం నిల్వలు, బియ్యం నాణ్యత, రికార్డులు, ఇతర సంబంధిత అంశాలను పరిశీలించేందుకు టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం. సాధారణంగా తనిఖీలు పారదర్శకంగా, ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా జరగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో తనిఖీలకు వచ్చిన అధికారుల బస ఏర్పాట్లను స్థానిక మిల్లర్లే చూసుకోవడంపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఆతిథ్యమా.. అనుమానాలకు తావా..?**

ప్రభుత్వ విధుల్లో భాగంగా తనిఖీలకు వచ్చే అధికారులకు అవసరమైన వసతి ఏర్పాట్లు సంబంధిత ప్రభుత్వ శాఖ లేదా అధికారిక యంత్రాంగం ద్వారా చేయడం సముచితమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీలకు గురయ్యే వ్యాపార సంస్థల నిర్వాహకుల నుంచి వసతి సదుపాయాలు పొందడం వల్ల అధికారుల నిష్పాక్షికతపై అనవసర సందేహాలు తలెత్తే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంలో ఎవరు ఖర్చులు భరించారు..? అధికారుల బసకు ముందస్తు అనుమతులు ఉన్నాయా..? తనిఖీల ప్రక్రియపై ఈ ఏర్పాట్ల ప్రభావం ఏమైనా పడిందా..? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

## ఉన్నతాధికారులు స్పందించాలి...

టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల వివరాలు, గుర్తించిన లోపాలు, నమోదు చేసిన నివేదికలు, తీసుకున్న చర్యలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యటనకు సంబంధించిన ఖర్చులు, వసతి ఏర్పాట్ల వివరాలను పరిశీలిస్తే ఈ వ్యవహారంపై నెలకొన్న సందేహాలకు సమాధానాలు లభించే అవకాశం ఉంది.

## తనిఖీల పారదర్శకతే కీలకం...

రా రైస్ మిల్లుల తనిఖీల్లో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా చర్యలు తీసుకోవడం, అధికారుల పర్యటనకు సంబంధించిన వసతి ఏర్పాట్లపై వాస్తవాలను వెల్లడించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తాటి శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శ



రామగిరి, అక్టోబర్ 17 (మనం న్యూస్): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన తాటి శ్రీనివాస్ గౌడ్ కుటుంబాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ శనివారం పరామర్శించారు. హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ తాటి మల్లికార్జున్ సోదరుడైన శ్రీనివాస్ గౌడ్ మృతి పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ఆర్మ్డ్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించి, నిర్వహణ తీరును సమీక్షించిన సీపీ అంబర్ కిషోర్ ఝా



బెల్లంపల్లి,అక్టోబర్ 17, (మనం న్యూస్ ) : రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం బెల్లంపల్లి ఆర్మ్డ్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హెడ్ క్వార్టర్స్‌లోని ఆర్ఐ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం, స్టోర్ రూమ్, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ సంపత్‌తో మాట్లాడి హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, విధుల కేటాయింపు, స్పెషల్ పార్టీ సిబ్బంది విధులు,ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాలు తదితర అంశాలపై సమగ్రంగా వివరాలు తెలుసుకున్నారు. హెడ్ క్వార్టర్స్‌లోని పరిసరాలను పరిశీలించిన సీపీ, పోలీస్ కార్యాలయాలు మరియు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా, సౌకర్యవంతమైన వాతావరణంలో ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

# రేకొండలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపిడిఓ రామ్మోహన్ చారి

చిగురుమామిడి: అక్టోబర్ 17 (మనం న్యూస్) : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ,దసరా పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో,సంతోషంగా జరుపుకునేలా రేకొండ గ్రామంలోని బతుకమ్మ ఘాట్ వద్ద ముందస్తు ఏర్పాట్లను అధికారులు,ప్రజాప్రతినిధులు శనివారం ఉమ్మడిగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి ఎంపిడిఓ రామ్మోహన్ చారి,ఎంపీఓ కిరణ్ కుమార్,రేకొండ గ్రామ సర్పంచ్ అల్లెపు సంపత్,ఉపసర్పంచ్ బిల్లా సంతోష్ రెడ్డి,గ్రామపంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్ పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు బతుకమ్మలు ఆడుకునే స్థలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్,తాగునీరు, పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. చెరువులు,ఘాట్ల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామంలోని ప్రజలందరూ ఈ పండుగను ప్రశాంత వాతావరణంలో వైభవంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.



# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17 (మనం ప్రతినిధి) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడిపాడి, జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ శాఖలు రూపొందించిన బతుకమ్మల్లో వ్యవసాయ శాఖకు మొదటి, రెవెన్యూ శాఖకు రెండో బహుమతి లభించాయి. విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రామగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



రామగిరి, అక్టోబర్ 17 (మనం న్యూస్): రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోహా ఎంపీడీఓ శైలజ రాణిహాధ్వర్యంలోహబతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వకీల్‌పల్లి కాలనీ మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. ఈ రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట, నాగేపల్లి గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

# మహిళపై దాడి కేసు నమోదు

కాసిపేట, అక్టోబర్ 17(మనంన్యూస్)కాసిపేట మండలం మల్కెపల్లి గ్రామానికి చెందిన అనూష అనే మహిళ పై, అదే గ్రామానికి చెందిన పోతరవేని మల్లేష్ కత్తి తో దాడికి పాల్పడ్డాడు. శుక్రవారం రాత్రి సౌండ్ బాక్స్ లు ఏర్పాటు చేసుకుని బతుకమ్మ ఆడుతున్న మహిళల తో,మధ్యం సేవించి వున్న మల్లేష్, సౌండ్ విషయమై బతుకమ్మ ఆడుతున్న మహిళలతో తాగాదాపడి, అనూష పై కత్తి తో దాడి కి పాల్పడినట్టు, బాధితురాలు పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్టు దేవాపూర్ ఎస్సై గంగారామ్ తెలియచేశారు.

# కలంపై కత్తి గట్టిన పోలీసులపై చర్యలేవి



వెల్గటూర్, అక్టోబర్ 17(మనం న్యూస్): కలం పై కత్తి కట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎండపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చేన్న కుమారస్వామి ఆధ్వర్యంలో మండలంలోని రాజారాం పల్లి వివేకానంద కూడలిలో నల్ల బ్యాడ్జీలతో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూల స్తంభంగా ఉన్న జర్నలిస్టులపై పోలీసుల అమానుష దాడి హేయమైన చర్య అని అభివర్ణించారు. నిజాలను నిర్భయంగా రాయడమే జర్నలిస్టుల పని అని దాన్ని చట్ట పరంగా ఎదుర్కోవాలే తప్ప చట్టాన్ని చుట్టంగా మార్చి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి దళిత రిపోర్టర్ల పై అక్రమ కేసులు పెట్టి వేధించిన పోలీసులను విధుల నుంచి తక్షణమే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోకేనపల్లి సతీష్, ఉపాధ్యక్షులు దొనకొండ శంకర్ అధికార ప్రతినిధి ఎనగందుల సంతోష్, చర్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు చుంచు అనిల్ ఎమ్మార్పీఎస్ నాయకులు చెన్న సతీష్, సత్తయ్య, సీపెల్లి ప్రశాంత్, కనుకుట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు ధర పొందాలి



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17 (మనం ప్రతినిధి) : పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. జిల్లాలో 50,300 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 45,270 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. నాణ్యత ఆధారంగా పత్తికి క్వింటాల్‌కు రూ.8,667 మద్దతు ధర లభిస్తుందని వెల్లడించారు. జిల్లాలో ఐదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# ధనలక్ష్మి అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

బెల్లంపల్లి అక్టోబర్ 17 (మనం న్యూస్) : బెల్లంపల్లి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో దసరా నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి నవరాత్రుల్లో ఏడవ రోజు అయిన శనివారం రోజున భక్తులకు అమ్మవారు ధనలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు యజ్ఞకులు శ్రీరామ్ బట్ల కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రోజు అమ్మవారికి కరెన్సీ నోట్లతో ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో అమ్మవారికి 55 లక్షల 55 వేల ఐదు వందల యాభై ఐదు రూపాయలతో అలంకరించారు శనివారం రోజు ప్రత్యేకించి సప్త



శతచండీ హోమం కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వేద పండితులు శ్రీరాంభట్ల కార్తీక్ శర్మ గారు మాట్లాడుతూ చండీ హోమం ఎంతో ప్రత్యేకత అయినదని దసరా నవరాత్రులు చండీ హోమం చేయడం వల్ల చాలా మంచి ఫలితాలు ఉంటాయని ఈ హోమం చేయడం సర్వ సుఖాలు అష్టైశ్వర్యాలు కలుగుతాయని బెల్లంపల్లిలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం అని చెప్పారు

# గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ సస్పెన్షన్

సిరిసిల్ల అక్టోబర్ 17 (మనం ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ, జోన్-3 రాజన్న ఇన్‌చార్జి డీఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్.,గారు శనివారం రోజున ఉత్తర్వులు జారీ చేశారు.విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, థర్డ్ డిగ్రీ చేసారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఎస్ఐ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.సస్పెన్షన్ కాలంలో ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లకూడదని ఆదేశించారు.



# వెంకటేశ్వర దేవాలయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కోరుట్ల అక్టోబర్ 17 (మనం న్యూస్) : కోరుట్ల పట్టణంలో గల అతి పురాతనమైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ఆలయ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పోరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు కోరుట్ల మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లు విచ్చేశారు ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా దేవాదాయ ఇన్స్పెక్టర్ రాజమౌలి నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ముఖ్య అతిథి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ వెంకటేశ్వర దేవాలయ నూతన అధ్యక్షులు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన అధ్యక్ష కార్యవర్గ సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆలయంలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అనంతరం కోరుట్ల పట్టణ బస్టాండ్ రోడ్ లో గల హనుమాన్ దేవాలయం నూతన కార్యవర్గ నియామక పత్రాలను అందజేశారు. త్వరలోనే వారి ప్రమాణ స్వీకారం



ఉంటుందని జువ్వాడి నర్సింగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుప్పాల ప్రభాకర్ అన్నం అనిల్, ఆడెపు మధు, జిందం లక్ష్మీనారాయణ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఎతిరాజం నర్సయ్య కార్యవర్గ సభ్యులు నేతి శ్రీనివాస్, కటుకం దివాకర్, కోట గంగాధర్, గోడికే రాములు, చిలువేరి విజయ్, చిట్యాల పద్మ ఆలయ ఈవో ఎం విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ పేడిపల్లి నర్సయ్య ఆలయ ప్రధానార్చకులు బీర్నంది నర్సింహా చారి పలువురు పట్టణ ప్రముఖులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుండి గ్రామంలో నూతన బతుకమ్మ ఘాటును ప్రారంభించిన స్పెషల్ ఆఫీసర్

రామడుగు, అక్టోబర్ 17 (మనం న్యూస్): గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు రామడుగు మండలం గుండి గ్రామంలో గ్రామ సర్పంచ్ గుమ్మడి మల్లేశం, పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ నిధుల నుండి నూతనంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాటును శనివారం మండల స్పెషల్ ఆఫీసర్ బండి రాజేశ్వరి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ బండి రాజేశ్వరి మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు సంతోషంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. గ్రామంలో పండుగల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. బతుకమ్మ ఘాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పండుగ సమయంలో గ్రామ ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండేలా గ్రామ సర్పంచ్ గుమ్మడి మల్లేశం, పాలకవర్గం బతుకమ్మ ఘాటును ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ



కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ రాజేశ్వరి, తాహసిల్దార్ దాసరి రాజు, ఎంపీఓ శ్రావణ్ కుమార్, ఏపీఓ రాధ, వార్డు సభ్యులు మడ్డి రాజు, పంజాల శ్రావణ్ గౌడ్,సోయల్,గోదరి తిరుపతి మడ్డి శ్వేత మురళి గౌడ్ ,గాండ్ల ఆంజనేయులు , పంచాయతీ కార్యదర్శి ఎం. జనార్ధన్, మాజీ ఉపసర్పంచ్ మేడి శ్రీనివాస్ గౌడ్,బొమ్మారవేణి లచ్చయ్య గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# దుర్గామాత సన్నిధిలో ఘనంగా కుంకుమ పూజ

జమ్మికుంట, అక్టోబర్ 17 (మనం న్యూస్) : జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో శ్రీ దుర్గ భవాని అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత సన్నిధిలో శనివారం అర్చకులు రాజగోపాల్ వేద మంత్రోచ్చారణల మధ్య కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మహిళలు అమ్మవారిని ప్రార్థించారు. భక్తి భావంతో



నిర్వహించిన కుంకుమ పూజలతో అమ్మవారి సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ పూజ కార్యక్రమం భక్తుల్లో భక్తి భావాన్ని నింపింది. 7వ రోజు శనివారం అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాజగోపాల్, శ్రీ దుర్గ భవాని అసోసియేషన్ సభ్యులు భవాని స్వాములు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.